
సాక్షి ప్రకాశం

బుధవారం । 18 । జూన్ । 2025



చూసి వెళ్లండోయ్.. నడుములిరుగుతయ్!

పామూరు మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గుంతలమయమై ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. - 8లో..



ప్రజలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసి డైవర్షన్ రాజకీయాల్లో మునిగితేలుతోందని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పార్టీ కార్యకర్తకు అన్నా పరామర్శ



నన్నేవలిని పరామర్శిస్తున్న అన్నా

తర్లుపాడు: ఈనెల 11న పొదిలిలో పోరుబాట జరిగిన కార్యక్రమంలో రాళ్లదాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని తుమ్మలచెరువుకు చెందిన షేక్ నన్నేవలిని మార్కాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అన్నా వెంట మండల పార్టీ కన్వీనరు మురారి, కౌన్సిలర్ ముంగమూరి శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు రామసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు పెద్దమస్తాన్, రమణారెడ్డి, పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, తుమ్మలచెరువు వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్, బూదాల గురవయ్య, సీహెచ్ రమేష్ తదితరులు ఉన్నారు.

కుటుంబ జీవనోపాధుల వివరాలు అప్‌డేట్ చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ నారాయణ

ఒంగోలు వన్‌టౌన్: స్వయం సహాయక గ్రూపుల కుటుంబ జీవనోపాధుల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ టీ నారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని వెలుగు-టీటీడీ సెంటర్‌లో జిల్లాలోని 36 మండలాల పరిధిలోని డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు కార్యాలయం సిబ్బందితో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న పీడీ మాట్లాడుతూ ఇప్పటి వరకూ జిల్లాలోని 45,257 గ్రూపులకు గానూ 18,685 గ్రూపుల జీవనోపాధుల వివరాలు మాత్రమే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారన్నారు. వార్షిక రుణ ప్రణాళిక, సూక్ష్మ రుణ ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్య సాధనపై సమీక్ష నిర్వహించారు. అదే విధంగా జూన్ 20వ తేదీ పొదుపు మహిళల యోగాంధ్రపై కమ్యూనిటీ కోఆర్డినేటర్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. సెర్ప్‌ను స్థాపించి ఇప్పటికీ 25 సంవత్సరాలు పూర్తి అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమేష్, డీపీఎంలు లైవ్‌లీహుడ్ డీ దానం, బ్యాంక్ లింకేజి అంబేడ్కర్, పెన్షన్‌లు లక్ష్మీరెడ్డి, సంస్థాగత నిర్మాణాలు రజనీకాంత్, ఫైనాన్స్ కృపారావు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

తిరుపతిరెడ్డి ఫిర్యాదు ఏమైంది ?



పోలీస్ స్టేషన్ వద్ద లీగల్ టీం సభ్యులు

పొదిలి: పొగాకు రైతుల్లో ఆత్మ స్థైర్యం నింపేందుకు, ధరలు పెంచేందుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11వ తేదీ పొదిలిలో పోరుబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పోరుబాట ర్యాలీలో వేలాది మంది పాల్గొనగా, అదే సమయంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో పోలీసుల అనుమతి లేని నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోరుబాట ర్యాలీపై కొంత మంది వ్యక్తులు రాళ్లు, చెప్పులు వేశారు. ఓ రాయి తగిలి గజ్జలకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నారు తిరుపతిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీస్ స్టేషన్‌లో కూడా దాడిలో గాయపడిన విషయమై పార్టీ నాయకులతో కలిసి తిరుపతిరెడ్డి ఫిర్యాదు చేశారు. ర్యాలీలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తిరుపతిరెడ్డి చేసిన ఫిర్యాదు గురించి సమాచారం తెలుసుకునేందుకు ఆర్‌టీఐ చట్టం ద్వారా స్టేషన్ అధికారికి పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు మంగళవారం దరఖాస్తు చేశారు.

తిరుపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు స్టేటస్ ఎలా ఉంది, ఎఫ్ఐఆర్ నమోదు చేశారా లేదా, విచారణ జరుగుతుందా లేదా అనే విషయాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుంటామని శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించటంతో 18 మంది రిమాండ్‌లో ఉన్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులు తెలిపారు.

కార్యక్రమంలో లీగల్ సెల్ ఒంగోలు అసెంబ్లీ అధ్యక్షుడు ధర్నాసి హరిబాబు, ఒంగోలు సిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు కాకుటూరి సంపత్‌కుమార్, జిల్లా ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడు కాళహస్తి వెంకట శేషారెడ్డి, జిల్లా సభ్యులు ధర్నాసి రామారావు, ఎంవి.రమణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమల అటవీ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి పెద్ద పులులు. అభయారణ్యం నుంచి తరచూ జనావాసాల వైపు వస్తుండడం గిరిజన గ్రామాల్లో అలజడి రేపుతోంది. రాత్రుళ్లు బయటకు రావాలంటే భయంతో వణికిపోతున్నారు. పెద్దపులులు పశువులపై దాడి చేస్తుండటంతో ఎప్పుడేం జరుగుతోందోనని ఆందోళన చెందుతున్నారు. తరుచూ పశువులపై పంజా విసురుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పల్లెలపై పంజా..





- నల్లమలలో 200 వరకూ పులులు
- ఆహారం కోసం నిత్యం గిరిజన గ్రామాలకు
- పశువులపై దాడులు
- భయాందోళనలో అటవీ సమీప గ్రామాల ప్రజలు
- పులల సంరక్షణకు బేస్ క్యాంప్

మార్కాపురం: ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్)లో దాదాపు రెండు వందల పులులు ఉన్నాయి. ఇవి ఆహారం, నీళ్ల కోసం తరుచూ అటవీ సమీప గ్రామాలవైపు వస్తున్నాయి. వన్యప్రాణులను వేటాడుతూ కొన్ని, పరిసర గ్రామాల్లో పశు సంపద కోసం కొన్ని వస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలు, పశువుల కాపర్లు, పొలాలకు వెళ్లే రైతులు, ఉపాధి కూలీలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, అర్ధవీడు, పెద్దారవీడు, మార్కాపురం తదితర మండలాల పరిధిలోని అటవీ సమీప గ్రామాల వైపు తరుచూ పులులు వస్తూ భయపెడుతున్నాయి. ఏ సమయంలో ఏవైపు నుంచి వచ్చి పెద్దపులి దాడి చేస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రెండు నెలల వ్యవధిలో పెద్దపులి 4 గేదెలు, 2 ఎద్దులపై దాడిచేసి హతమార్చాయి. దీంతో పశువులను మేపుకునేందుకు పశువుల కాపరులు, పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గత నెలలో మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువు తాండ ప్రాంతాల్లో పెద్దపులి దాడిచేసి గేదెను చంపింది. దీనిని పి139 పెద్దపులి (మగపులి)గా అటవీ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా పెద్దారవీడు మండలం కలనూతల, సుంకేశుల, గుండంచర్ల, మార్కాపురం మండలం గొట్టిపడియ, అక్కచెరువు తాండ, అర్ధవీడు మండలం బొల్లుపల్లి, మిట్టమీదిపల్లి, కొత్తూరు, అయ్యవారిపల్లి, వీరభద్రాపురం గ్రామాల్లో పెద్దపులి సంచారాన్ని గ్రామస్థులు కనుగొన్నారు.

- ఈ నెల 13వ తేదీ యర్రగొండపాలెం మండలం పాలుట్లలో పశువులపై పెద్దపులి దాడిచేసి రెండు ఎద్దులను చంపింది.
- ఈనెల 10వ తేదీ అర్ధవీడు మండలం బొల్లుపల్లికి చెందిన నాగేశ్వరరావు తన ఎద్దులను కొట్టంలో కట్టివేశారు. పెద్దపులి ఎద్దుపై దాడిచేసి చంపి అడవిలోకి వెళ్లిపోయింది.
- ఈనెల 6వ తేదీ మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామ శివార్లలో వెంకటేశ్వరరెడ్డికి చెందిన గేదెను పెద్దపులి చంపింది.
- మే 30న అర్ధవీడు మండలం పాపినేనిపల్లి అటవీ ప్రాంతంలో ఆవుపై పెద్దపులి దాడిచేసి చంపింది. బొప్పాయితోటలో ఆవు మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు.
- ఏప్రిల్ 30న మాగుటూరు తండాలో పెద్దపులి గేదెను చంపింది. ఏప్రిల్ 10న పెద్దారవీడు మండలం కలనూతలలో గేదెపై పులి దాడి చేసి చంపింది.

మొత్తంగా పది నెలల కాలంలో దాదాపు 30 ఆవులు, ఎద్దులను హతమార్చాయి. దీంతో రైతులు, ప్రజలు, పశుపోషకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గొట్టిపడియ సంఘటనలో పులి పాదముద్రలు సేకరించారు.

బేస్ క్యాంపుల ఏర్పాటు...

నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేందుకు బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పెద్దపులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాటి కదలికల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, ఇష్టకామేశ్వరి ఆలయం, దొరబైలు, నారుతడికల, పాలుట్ల, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, కొర్రపోలు, చిన మంతనాల, రోళ్లపెంట తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో ఐదుగురు అటవీ అధికారులు ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం మీద 120 మంది ప్రొటెక్షన్ వాచర్లు పులుల సంరక్షణలో ఉన్నారు. వీటి సంరక్షణకు ఇలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా అవి పక్కాగా అమలు కాకపోవడంతో తరుచూ అవి గ్రామాలవైపు వస్తున్నాయి.

ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దు

పశువుల మేత కోసం ఒంటరిగా అడవుల్లోకి పశు పోషకులు, రైతులు వెళ్లవద్దు. గ్రామ మొదట్లోనే పశువులను మేపుకోండి. గొట్టిపడియలో పెద్దపులి బర్రె దూడను చంపేసింది. వన్యప్రాణులు, పులులు కనిపిస్తే మాకు సమాచారం అందించండి. వాటిని చంపే ప్రయత్నం చేయవద్దు. విద్యుత్ తీగలు, వలలు వేయవద్దు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వన్యప్రాణులు జనావాసాల్లోకి రాకుండా అటవీ ప్రాంతంలో నీటి సౌకర్యం ఏర్పాటు చేశాం.

– నాగరాజు, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు, మార్కాపురం.

సీఎం ఇలాకాలో మహిళలకు రక్షణ లేదు

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ



ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, దీనికి కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఘటనను నిదర్శనంగా పేర్కొనవచ్చని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో టీడీపీ నాయకుడు మణి కన్నప్ప ఒక మహిళను అసభ్యంగా దూషించడమే కాకుండా అత్యంత దుర్మార్గంగా చెట్టుకు కట్టేయడం యావత్ దేశ ప్రజలను కదిలించిందన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలో ఇంకెంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అనంతపురం జిల్లాలో ఒక బాలికను 18 మంది అత్యాచారం చేసిన తరువాత కూడా ప్రభుత్వం లో ఎలాంటి మార్పు కనిపించడం లేదన్నారు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మహిళలు, బాలికలు అత్యాచారానికి గురవుతున్నారని, పాలకులు మాత్రం కక్ష సాధింపు చర్యలతోనే కాలం గడిపేస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను అడ్డుకోవడమే కాకుండా వారి మీద అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి పాలకులు మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుప్పం మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఏడాది పాలనలో అరాచకాలు, అరెస్టులు

- పూర్తిగా క్షీణించిన శాంతిభద్రతలు
- పొదిలి ర్యాలీకి సంబంధించి వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్ష సాధింపు చర్యలు
- జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం
- కూటమి ఏడాది పాలనపై వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించిన బూచేపల్లి



కూటమి వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: గడిచిన ఏడాది పాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు, అరెస్టులు తప్ప సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. చీమకుర్తిలో ఏడాది పాలనకు సంబంధించి చంద్రబాబు వెన్నుపోటుపై ప్రచురించిన "జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం" అనే పుస్తకాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి శివప్రసాదరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఏదైనా చెప్పాడంటే చేస్తాడనే నమ్మకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుపుకున్నాడన్నారు. కానీ చంద్రబాబు మాత్రం చెప్పింది చేయడనే మోసాన్ని చాటుకున్నాడన్నారు. గత ఏడాది చంద్రబాబు పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వచ్చిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ప్రజలపై కేసులు పెట్టడం, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. విద్య, వైద్య రంగాలతో పాటు వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో చిక్కుకుందని బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కక్ష సాధింపు చర్యలను పుస్తకం రూపంలో ప్రచురించారని, దానిని పార్టీ నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు బీమన వెంకట్రావు, సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మక్కెన రాజేంద్ర, కూరాకుల సుబ్బారెడ్డి, కూడలి మాలకొండయ్య, గండి రోశయ్య, కుంచాల రాంబాబు, పెరికల నాగేశ్వరరావు, బొంతా సంతోష్, పొన్నపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నియంత పాలనకు ఏడాది



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పార్టీ నాయకులు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో దుర్మార్గపు నియంత పాలన ఏడాది కాలం పూర్తి చేసుకుందని, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విడుదల చేసిన '5 కోట్ల ప్రజలకు వెన్నుపోటు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ చూడని పరిస్థితులు ఏడాది కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు చవిచూస్తున్నారని, దురాగతాలు, అరాచకాలు, తప్పుడు కేసులు బనాయించడం, ఆడబిడ్డలపై అత్యాచారాలు, హత్యలు, దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన యువతపై గంజాయి కేసులు నమోదు చేయడం లాంటి సంఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకున్నాయని అన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల గురించి ప్రచురించటానికి సూట్ కేస్ అంత పుస్తకం కూడా సరిపోదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఆర్భాటంగా తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అమలు చేసి సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేశామని, వాటి గురించి ఎవరైనా మాట్లాడితే నాలుక తెగకోస్తానని సీఎం అనడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు కూల్చివేయడమే పనిగా పెట్టుకున్నారని, ప్రశ్నించిన నాయకులపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడమే వారు సాధించిన ఘనకార్యమని అన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులపై నోరుమెదపరే..

డీసీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళిత బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనలో ఆయన ఎటువంటి చర్య తీసుకోలేక పోయారని, సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో తాజాగా రూ.80 వేలు అప్పు చెల్లించలేదని ఒక మహిళను తన కన్నకొడుకు ఎదురుగా చెట్టుకు కట్టేసి దాడికి పాల్పడిన సంఘటన కలచి వేస్తుందని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికార మదం, కండకావరంతో మహిళలపై విరుచుకొని పడుతున్నారని, కూటమి ప్రభుత్వంలో ఆడవారికి ఇస్తున్న గౌరవం ఇదేనని ఆయన అన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన వైఎస్ జగన్:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజల గుండెల్లో పదిలంగా నిలిచారని, ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేరుతోనే అందచేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. అమ్మ ఒడి పథకాన్ని సజావుగా అమలు చేశారన్నారు. కూటమి పాలనలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం వలన వాళ్లు రోడ్డు ఎక్కుతున్నారని, పొగాకు కొనుగోలు చేయాలని పురుగుల మందు బాటిళ్లతో ఆందోళన చేస్తున్న రైతుల్లో టీడీపీ వర్గీయులు కూడా ఉండటం గమనార్హమని అన్నారు. దగా పడుతున్న పొగాకు రైతులను పరామర్శించటానికి, వారికి మద్దతుగా జగన్‌మోహన్‌రెడ్డి పొదిలికి వచ్చిన సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన రైతులు, అభిమానులను చూసి కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక పోయిందని, టీడీపీ వర్గీయులతో జగనన్న ర్యాలీపై రాళ్లు రువ్వించిందని అన్నారు. రాళ్లు విసిరింది టీడీపీ వాళ్లని స్పష్టంగా తెలుస్తున్నా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సమావేశంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ సీహెచ్ విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షులు ఏకుల మునలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి, జిల్లా కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, సింగా ప్రసాద్, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, కోటిరెడ్డి, సుబ్బారెడ్డి, వివిధ విభాగాల నా యకులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఎం.బాలగురవయ్య, గుమ్మా ఎల్లెష్ యాదవ్, పల్లె సరళ, రోషిరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, మురారి గాలయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఉన్నా..అందని వైద్యం

- డాక్టర్ లేరు..ఉన్న కాంపౌండర్‌ను డిప్యుటేషన్‌కు..
- హోమియో వైద్యశాలను తెరిపించాలని వేడుకుంటున్న గ్రామస్తులు



వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు(ఫైల్)



మూతపడిన హోమియో వైద్యశాల



హోమియో వైద్యశాలలో ఉన్న మందులు

కొనకనమిట్ల: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది కొనకనమిట్ల మండలం పెదారికట్ల హోమియో వైద్యశాల పరిస్థితి. వైద్యశాలలో ఉన్న డాక్టర్‌ని బదిలీ చేశారు. డాక్టర్ లేకపోయినా ఉన్న కాంపౌండర్ వైద్యశాలకు వచ్చే వారికి హోమియో మందులు ఇచ్చి పంపేవారు. కానీ ఆయనను కూడా 10 నెలల క్రితం డిప్యుటేషన్‌పై వేరే చోటకు సాగనంపారు. దీంతో అప్పటి నుంచి వైద్యశాల మూతపడింది. ఆస్పత్రిలో మందులు లోపలే మగ్గిపోతున్నాయి. సుమారు 50 ఏళ్ల క్రితం పెదారికట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనంలోని ఓ గదిలో ఏర్పాటు చేసిన హోమియో వైద్యశాలలో డాక్టర్, కాంపౌండర్ అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందిస్తుండటంతో చుట్టుపక్కల నాలుగు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంది. అంతవరకు బాగానే ఉన్నా గతేడాది డాక్టర్‌ను వేరే చోటకు బదిలీ చేశారు. వైద్యశాలలో ఉన్న కాంపౌండరే అక్కడ దిక్కుగా మారాడు. వచ్చిన వారికి మందులు ఇచ్చి పంపేవాడు. కానీ అతన్ని కూడా అధికారులు ఉండనీయలేదు. పై అధికారులు చెప్పారని ఇక్కడి నుంచి మన్నేపల్లిలోని హోమియో వైద్యశాలకు డిప్యుటేషన్ పేరుతో అక్కడికి పంపారు. అప్పటి నుంచి హోమియో వైద్యశాల మూతపడింది. నిత్యం పలు వ్యాధులకు హోమియో మందులు వాడే వారు వైద్యశాల మూతపడటంతో ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లక తప్పటంలేదని స్థానిక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో హోమియో వైద్యసేవలు పొందిన ప్రజలు వైద్యశాల మూతపడటంతో కొన్ని నెలల క్రితం వైద్యశాల వద్దకు వచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వైద్యశాలను తెరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

హోమియో వైద్యశాలను తెరిపించాలి..



ప్రభుత్వ హోమియో వైద్యశాల ఉండటం వలన ప్రజలకు ఎంతగానో ఉపయోగపడింది. హోమియో మందులు వాడటం వలన జబ్బులు నయం కావడంతో చాలా మంది ఆస్పత్రికి వచ్చేవారు. డాక్టర్, కాంపౌండర్‌ను బదిలీ చేయటం అన్యాయం. సంబంధిత అధికారులు స్పందించి హోమియో వైద్యశాలకు డాక్టర్, సిబ్బందిని నియమించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి.

– ఎస్ బాలచంద్రుడు, పెదారికట్ల

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల నియామకాలు

ఒంగోలు టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియమకాలు చేపట్టినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్టీ సెల్ వైస్ ప్రసిడెంట్గా రామావత్ అరుణా బాయి (యర్రగొండపాలెం), రాష్ట్ర ఎస్టీ సెల్ జోనల్ ప్రెసిడెంట్‌గా రావూరి ప్రభావతమ్మ (కొండపి), రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా ఎర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (యర్రగొండపాలెం)ని నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీగా షేక్ నూర్ అహ్మద్ (యర్రగొండపాలెం), రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శిగా గొడుగు కాలేషా (సంతనూతలపాడు), రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం కార్యదర్శిగా దోర్నాల వరలక్ష్మమ్మ (మార్కాపురం), రాష్ట్ర కల్చరల్ విభాగం కార్యదర్శిగా షేక్ మహమ్మద్ బాషా (కొండపి)ని నియమించారు.

క్లుప్తంగా

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

- ఇరువర్గాల ఆమోదంతోనే కేసుల పరిష్కారం
- జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి

ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాల ఆమోదంతోనే కేసుల పరిష్కారమవుతాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీకి అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారం చెల్లింపు కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమ తీర్పు అని, ఇక్కడ పరిష్కారమైన కేసులకు సంబంధించి కోర్టుల్లో చెల్లించిన ఫీజును కూడా వాపస్ పొందవచ్చని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ప్రీసిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాలు పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు సహకరిస్తారని, పోలీసు అధికారులు, న్యాయవాదులు, అధికారులు పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

యోగాలో డ్వాక్రా మహిళలు పాల్గొనాలి

ఒంగోలు సబర్బన్: ఈనెల 20వ తేదీన స్వయం సహాయక సంఘాల సభ్యులతో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఒంగోలు నగరంలోని మినీ స్టేడియం, పీవీఆర్ స్కూల్ గ్రౌండ్, ఏబీఎం స్కూల్ గ్రౌండ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలిచ్చారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, మెప్మా, డీఆర్డీఏ పీడీలు శ్రీహరి, నారాయణ, డీఎస్‌డీఓ రాజరాజేశ్వరి తదితరులు ఉన్నారు.

డప్పు కళాకారుల పోరాట సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఏసమ్మ


ఏసమ్మ

మార్కాపురం: మాదిగ, చర్మ, డప్పు కళాకారుల పోరాట సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా శిరిగురి ఏసమ్మను నియమించినట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు సండ్రపాటి కాలేబు మాదిగ మంగళవారం తెలిపారు. ఈమె కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల గ్రామ మాజీ ఎంపీటీసీగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు 2 ఎకరాల సాగు భూమిని ప్రభుత్వం పంపిణీ చేయాలని, 40 సంవత్సరాలు నిండి అర్హులైన చర్మ డప్పు కళాకారులకు పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిందని అన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి


రోడ్డుపై బోల్తా పడిన ట్రాక్టర్


మృతి చెందిన మహేష్

పీసీపల్లి: ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం పీసీపల్లి మండలంలోని బట్టుపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దన్నపల్లికి చెందిన అరటివేముల మహేష్(38) వ్యవసాయ పనులతో పాటు బేల్దారి మేస్త్రీగా కూడా చేస్తుంటాడు. పీసీపల్లిలో ఓ ఇల్లు నిర్మించేందుకు ఒప్పుకొన్నాడు. భవనానికి అవసరమైన ఇనుము ఇతర సామగ్రిని తన సొంత ట్రాక్టర్‌లో కనిగిరి నుంచి తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో బట్టుపల్లి వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి ఇంజన్ తిరగబడింది. ఈ ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై కోటయ్య పరిశీలించారు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి, మహేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మహేష్‌కు భార్య స్రవంతి, కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త అకాల మరణంతో భార్య స్రవంతి కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.


30వ మైలువద్ద గుంతలమయంగా తూర్పు కట్టకిందపల్లె రోడ్డు


ప్రమాదకరంగా ఉన్న కందుకూరు రోడ్డు మార్జిన్లు


ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుంతలతో ఉన్న కందుకూరురోడ్డు

చూసి వెళ్లండోయ్.. నడుములిరుగుతయ్!

- పామూరు మండలంలో ప్రమాదకరంగా హైవే కనెక్టివిటీ రోడ్లు
- గోతులమయంగా పంచాయతీరాజ్ రహదారులు
- మరమ్మతులపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం


పామూరు సీహెచ్‌సీ సమీపంలో గుంతల మయంగా కందుకూరురోడ్డు

పామూరు:

మండల కేంద్రమైన పామూరు సరిహద్దుల్లో హైవే కనెక్టివిటీ రోడ్లతోపాటు గ్రామీణ రహదారులు గోతులమయంగా మారయి. పామూరు నుంచి కందుకూరు వెళ్లే 167బీ జాతీయ రహదారి కనెక్టివిటీ రోడ్డుపై సీహెచ్‌సీ సమీపంలో గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు కొంతదూరం సింగిల్ రోడ్డు కావడం, మార్జిన్లలో గోతులు ఉండటంతో వాహనదారులు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. ఆ ప్రాంతంలో కమ్యూనిటీ వైద్యశాల, ప్రైవేట్ వైద్యశాల ఉన్న ఈ హైవే కనెక్టివిటీ రోడ్డులో నిత్యం వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటాయి. దీంతో ఏ క్షణం ప్రమాదం బారిన పడతామోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు.

- పామూరు నుంచి నెల్లూరు వెళ్లే 565 నేషనల్ హైవే కనెక్టివిటీ రోడ్డు సింగిల్‌ది కావడం, సైడు మార్జిన్లు గుంతలమయంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రెండు రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చి ప్రమాదాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లె దారుల్లో నరకయాతన

పామూరు మండలంలోని పంచాయతీరాజ్ రోడ్లు వాహనదారులకు చుక్కలు చూపుతున్నాయి. మండలంలోని 30వ మైలు వద్ద నుంచి తూర్పు కట్టకిందపల్లె, కరోళ్లపాడు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు గోతులమయంగా మారింది. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో ఆటోలు, ద్విచక్రవాహనాలు,


గోతుల మయంగా తూర్పు కట్టకిందపల్లె, కరోళ్లపాడు రోడ్డు

ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులు తిరుగుతుంటాయి. హైస్కూల్, జూనియర్, డిగ్రీ, బీఈడీ, డైట్ కళాశాలల విద్యార్థులు రోజూ రాకపోకలు సాగించే ఈ రోడ్డును బాగు చేయాలని పడమటి కట్టకిందపల్లె, కరోళ్లపాడు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఏడాదైనా.. స్పందన సున్నా..

రహదారుల మరమ్మతులపై కూటమి సర్కారు చేసిన ప్రకటనలకు, క్షేత్ర స్థాయిలో పరిస్థితికి పొంతన కుదరడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి



మండల కేంద్రమైన పామూరు నుంచి నెల్లూరు వెళ్లే 565 జాతీయ రహదారి వరకు, కందుకూరు వెళ్లే 167బీ జాతీయ రహదారి వరకు కనెక్టివిటీ రోడ్లు సరిగా లేవు. రోడ్డంతా గుంతలు, సరిలేని మార్జిన్ల వల్ల భయభయంగా వెళ్లాల్సి వస్తోంది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కట్టకిందపల్లె, కరోళ్లపాడు రోడ్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.

– అంబటి కొండారెడ్డి, పామూరు

నిధులు రాగానే నిర్మిస్తాం

పామూరు మండలంలోని 30వ మైలు వద్ద నుంచి కరోళ్లపాడు వరకు రూ.3.25 కోట్లతో నూతన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– ఎలీషా, జేఈ, పీఐయూ వర్క్స్

ప్రజలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు
- 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పొదిలి: రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలను గాలికొదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాల్లో మునిగి తేలుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు విమర్శించారు. పార్టీ మీడియా సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన '5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు' అనే పుస్తకాన్ని అన్నా రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం కోసమే చంద్రబాబు నాయుడు అలవికాని హామీలు ఇచ్చారన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం ఎక్కువగా పచ్చ చొక్కాలకే లబ్ధి చేకూర్చేలా వ్యవరిస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టి, ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారన్నారు. ఎవరు ఏమి హామీలు ఇచ్చారు, ఎవరి పరిపాలనలో హామీలు చక్కగా అమలయ్యాయో ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. కేవలం ప్రజలను భ్రమల్లో ఉంచేందుకు పీ–4 పథకం అమలు చేస్తామని చెబుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజాభిమానం పొందాలే తప్ప, హామీలపై ప్రశ్నిస్తే ఓర్చుకోలేని స్థితిలో పాలకులు ఉండటం సరికాదన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చామని చెప్పడం మరింత విడ్డూరంగా ఉందన్నారు. ఏ హామీని ఎప్పుడు నెరవేర్చారు, ఎవరు లబ్ధిపొందారో అర్థం కావటం లేదన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, అధికార ప్రతినిధి మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో కార్యకర్తల్లో ఆత్మ స్థైర్యం నింపాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి, అన్ని రకాలుగా నష్టపోయిన కార్యకర్తలు ఎంతో మంది ఉన్నారన్నారు. అక్రమ కేసులను లీగల్ సెల్ సాయంతో ఎదుర్కొందామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడం శోచనీయమన్నారు. అప్పులు చేయడం ఒక్కటే కూటమి ప్రభుత్వ ఘనత అని ఎద్దేవా చేశారు. పుస్తకావిష్కరణ అనంతరం కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళి, జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు, పార్టీ మండల మాజీ కన్వీనర్ గుజ్జుల సంజీవరెడ్డి, రైతు విభాగం నాయకుడు కె.సుబ్బారావు, పార్టీ నాయకులు శింగారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, పేరం సుభాష్‌రెడ్డి, పేరం నాగిరెడ్డి, అన్నవరం బ్రహ్మారెడ్డి, బేతా ప్రకాశ్‌రెడ్డి, తిరుమలరెడ్డి నాగిరెడ్డి, కొండాయపాలెం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బూచేపల్లి కమలాకర్‌రెడ్డి జయంతి

- నివాళులర్పించిన బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


కమలాకర్‌రెడ్డి స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు

చీమకుర్తి: సినీ హీరో, నిర్మాత బూచేపల్లి కమలాకర్‌రెడ్డి 48వ జయంతి సందర్భంగా తల్లి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సోదరుడు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సతీమణి నందిని ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం చీమకుర్తిలోని బూచేపల్లి కమలాకర్‌రెడ్డి పార్కులో ఆయన స్మారకం వద్ద తొలుత కేక్ కట్ చేశారు. కమలాకర్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బూచేపల్లి కుటుంబ సభ్యులతోపాటు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి స్థల దాహం


ఆర్వో ప్లాంటును కూల్చి చదును చేస్తున్న జేసీబీ



వాటర్ ప్లాంటు ఉన్న భవనం

- దర్శిలోని నిమ్మలబావి సమీపంలో ఆర్వో ప్లాంట్ కూల్చివేత
- రూ.25 లక్షల విలువైన స్థలాన్ని కొట్టేసిన టీడీపీ నాయకుడు
- అక్రమార్కుడికి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం

సాక్షి టాస్క్‌ఫోర్స్: దర్శి నగరపంచాయతీ ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను తొలగించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు కూటమి నాయకులు సిద్ధమయ్యారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు సాగిస్తున్న అక్రమ దందాను చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో నియోజకవర్గ టీడీపీ నేతకు ముడుపులందినట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. దర్శిలోని నిమ్మల బావి సమీపంలో ఆర్వో ప్లాంట్‌ను ఓ టీడీపీ నాయకుడు జేసీబీతో కూలగొట్టి చదును చేశాడు. నగర పంచాయతీ అధికారుల సహకారంతోనే ఆ స్థలాన్ని టీడీపీ నాయకుడు ఆక్రమించుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగర పంచాయతీ నడిబొడ్డున ఉన్న ఈ స్థలం విలువ సుమా రూ.25 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. ప్రస్తుత దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి తండ్రి మాజీ ఎమ్మెల్యే దివంగత బూచేపల్లి సుబ్బారెడ్డి దర్శి ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వ, నగర పంచాయతీ నిధులు వెచ్చించి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. అప్పటి వైఎస్సార్ సీపీ సర్పంచ్ చంద్రగిరి గురవారెడ్డి వాటర్‌ప్లాంటు ద్వారా తాగునీరు అందించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్లాంట్ స్థలంపై కన్నేసిన ఆ పార్టీ నాయకులు ప్లాంటును నిర్వీర్యం చేశారు. ఇప్పుడు ఏకంగా స్థలాన్నే కబ్జా చేశారు. మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంటును పునరుద్ధరించి తాగునీటి సమస్య పరిష్కరించాల్సిన నగర పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా ఆక్రమణలకు సహకరించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

జూమ్ విధానంలోనే వైద్యశాఖలో బదిలీలు

- మాన్యువల్ విధానంలో చేయాలన్న ఉద్యోగుల వినతిని పట్టించుకోని ప్రభుత్వం
- తొలిరోజు 80 మంది బదిలీ


జూమ్ విధానం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: వైద్యశాఖలో సాధారణ బదిలీలు మొదలయ్యాయి. మంగళవారం తొలిరోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన బదిలీల ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. మాన్యువల్‌గా బదిలీలు చేపట్టాలని వైద్య ఉద్యోగులు ఎంతగా ప్రాధేయపడిన పెడచెవిన పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం తను అనుకున్నట్లే జూమ్ విధానంలో బదిలీలు చేపట్టింది. వీరిలో ల్యాబ్ టెక్నీషియన్లు 12, జూనియర్ అసిస్టెంట్లు 5, టైపిస్టులు 3, ఎల్‌డీ కంప్యూటర్ 5, డ్రైవర్లు 11, ఆఫీసు సబార్డినేటర్లు 31, ఎంఎన్‌ఓలు 1, ఎఫ్ఎన్‌ఓలు 4, స్వీపర్లు నలుగురు ఉన్నారు. తొలిరోజు మొత్తం 80 మందిని బదిలీ చేశారు. బుధవారం జిల్లాలోని 132 మంది ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సిబ్బంది ప్రాధాన్యత ప్రకారం వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీలు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో జిల్లా పరిపాలనాధికారి గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్, డేటా మేనేజర్ ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కంభం: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి అదాలత్ ఓ మంచి వేదిక అని సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జిల్లా జడ్జి ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏబీ ఫంక్షన్ హాల్లో మార్కాపురం డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నకంభంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల నీటి సమస్య తలెత్తుతోందని, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కందులాపురం ఇలాకాలో తమ ప్లాట్లకు ఆనుకుని విద్యుత్ మెయిన్ లైన్ స్తంభాలు వేస్తున్నారని, వాటి వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని పలువురు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. లోఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని పలువురు అర్జీలు అందజేశారు. ఇలా మొత్తం 20 అర్జీలు రాగా 16 సమస్యలు పరిష్కరించారు. మిగిలిన 4 అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఆదేశించారు. అనంతరం విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, కంభం డీఈఈ శ్రీనివాస రెడ్డి, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకొని వైద్యశాలకు తరలించిన ఎస్సై
- పోలీసులు న్యాయం చేయకపోవడంతోనే ఆత్మహత్యకు యత్నించాడని బాధితుడి తండ్రి ఆరోపణ


వైద్యశాలలో చికిత్స పొందుతున్న రవి

కంభం: ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా డయల్–100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన స్పందించి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటన మంగళవారం కంభంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన కంచు రవి కంభం చెరువుకట్ట సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకోబోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై నరసింహారావు ఆ యువకుడిని పోలీసు జీపులో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పోలీసులపై ఆరోపణలు

సెల్ ఫోన్ తాకట్టు విషయంలో ఈనెల 14వ తేదీన రవికుమార్, అతని స్నేహితుడు కంభాల అభిషేక్‌రెడ్డి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పంచాయతీ పోలీసుల వద్దకు చేరింది. రవికుమార్ తనకు రావాల్సిన రూ.3,200 వెంటనే ఇప్పించాలని కోరగా నాలుగు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పి పంపారు. రవికుమార్ ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలుసుకున్న అతని తండ్రి రంగనాయకులు కంభం ప్రభుత్వ వైద్యశాల వద్దకు వచ్చాడు. ఎస్సై తన కొడుకుని కొట్టాడని, అవతలి వారి వద్ద పోలీసులు డబ్బు తీసుకుని అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ వాగ్వివాదానికి దిగాడు. అక్కడికి చేరుకున్న కొందరు గ్రామస్తులు ఆయనకు నచ్చజెప్పారు.

కెరీర్ గైడెన్స్ ఎంతో కీలకం


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: విద్యార్థి దశలోనే భవిష్యత్తుపై ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధించే దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సూచించారు. మంగళవారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రూట్ టు రైజ్ థ్రైవ్ ఫౌండేషన్, బాలల వనరుల కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన ఉజ్వల భవిష్యత్తు కార్యక్రమనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని, పాఠాలతో పాటు ఇతర అంశాల్లోనూ రాణించాలని చెప్పారు. ప్రపంచ విజేతల జీవితాలను నిత్యం అధ్యయనం చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉద్యోగ అవకాశాల వివరాలను నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీవైఈఓ చంద్రమౌళేశ్వరరావు, డీసీపీఓ దినేష్ కుమార్, బంగారు బాల్యం నోడల్ ఆఫీసర్ గిరిధర్‌శర్మ, రూట్ టు రైజ్ థ్రైవ్ వ్యవస్థాపకురాలు రషీద, హెచ్‌ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

COACHING

- నవోదయ కోచింగ్: 5వ, 8వ క్లాసులకు నవోదయ కోచింగ్ లాంగ్‌టర్మ్ క్లాసులు జరుగుచున్నవి. హాస్టల్‌వసతి కలదు. సంప్రః గాంధి పబ్లిక్‌స్కూల్, మంగమూరు రోడ్డు, ఒంగోలు. ✆ 93902 10032 [OA-439]

Wanted

- ఒంగోలు టౌన్‌లో 3 సం. అనుభవం గల సెక్యూరిటీ Hg, గార్డ్స్ కావలెను. జీ: 15650/-, 13400/- PF, ESI లతో రూమ్+భోజనం ఫ్రీ. ✆ 83318 76264 [SCA25005060]
- ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th – డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239 [SCA 25004925]
- సూళ్లూరుపేటలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు క్యాజువల్ వర్కర్స్, గార్డెన్ వర్కర్స్ కావలెను. రూమ్, క్యాంటీన్ సౌకర్యం కలదు ✆ 70939 24466, 81427 61777 [SCA25005125]
- Wanted Principal, Maths, English,Social. Free Accommodation. Con: 8639096944, 8142660770 [SCA-25005021]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.